# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 313 | పేజీలు: 4 | వెల: 4/- | గురువారం ● 23, మే 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## అమెరికా జార్జియాలో చెట్టును ఢీకొన్న కారు

### ప్రమాదంలో ముగ్గురు భారతీయ విద్యార్థుల మృతి

**న్యూఢిల్లీ,మే22(నమస్తే ఉదయం):** అమెరికాలో జార్జియా రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భారత సంతతి విద్యార్థులు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈనెల 14న ఈ ఘటన చోటు చేసుకోగా..అల్ఫారెట్టా పోలీసులు తాజాగా వివరాలు వెల్లడించారు. జార్జియా విశ్వవిద్యాలయంలో చదువుతున్న ఆర్యన్ జోషి, శ్రీయా, అన్వీ శర్మ, రిత్వక్ సోమేపల్లి, మహ్మద్ లియాకత్ అనే



ఐదుగురు భారత సంతతి విద్యార్థులు కారులో ఓ కార్యక్రమానికి వెళు‌తున్నారు. ఈ క్రమంలోనే జార్జియాలోని అల్ఫారెట్టా సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో ఆర్యన్ జోషి, శ్రియలు అక్కడికక్కడే మరణించగా..అన్వీ శర్మ పరిస్థితి విషమించి ఆస్పత్రిలో మృతి చెందారు. మిగతా ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధిత విద్యార్థులంతా 18ఏళ్ల వయసు వారే కావడం గమనార్హం. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# 2 రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలి

- సమస్యల పరిష్కారం, అభివృద్ధిపై అక్కడి కొత్త ప్రభుత్వంతో కలిసి ముందుకు..
- తిరుమలలో భక్తుల కోసం సత్రం, కల్యాణ మండపం నిర్మిస్తాం: రేవంత్
- శ్రీవారి సన్నిధిలో మనుమడికి పుట్టెంట్రుకలు.. కుటుంబ సమేతంగా దర్శనం
- ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడే కొత్త ప్రభుత్వం, ముఖ్యమంత్రితో కలిసి ముందుకు సాగుతాం
- తిరుమలలో భక్తుల కోసం సత్రం, కల్యాణ మండపం నిర్మిస్తాం: రేవంత్
- కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ సీఎం
- మనవడి పుట్టెంట్రుకల మొక్కు చెల్లింపు



**తిరుమల, మే 22 (నమస్తే ఉదయం):** రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడబోయే ప్రభుత్వం, ముఖ్యమంత్రితో తెలంగాణ సీఎంగా సత్సంబంధాలు కొనసాగిస్తూ సమస్యలన్నిటినీ పరిష్కరించుకుని ఇరు రాష్ట్రాలు అభివృద్ధి పథంలో పరస్పర సహకారంతో ముందుకెళ్లాలని కోరుకుంటున్నట్లు వ్యాఖ్యానించారు. బుధవారం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న అనంతరం రేవంత్.. ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక స్వామి దర్శనం చేసుకోవాలని ప్రయత్నించినా.. సమయం దొరకలేదని, ఇన్నాళ్లకు స్వామి దర్శన భాగ్యం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు.

తమ ప్రభుత్వం తరపున తిరుమలలో ఓ సత్రం, కల్యాణ మండపం నిర్మించి భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఏపీలో ఎన్నికల ప్రక్రియ ముగిశాక సీఎంను కలిసి తెలంగాణ ప్రభుత్వం తరఫున స్వామి సేవలో భాగస్వాములవుతామని చెప్పారు. వాతావరణం అనుకూలిస్తోందని, గత ఏడాది కరువు వచ్చి తాగునీటి సమస్య ఉన్నప్పటికీ సమస్యలను అధిగమించేలా మంచి రుతుపవనాలు వస్తున్నాయని వెల్లడించారు. రెండు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని, ప్రకృతి కూడా అలానే సహకరిస్తోందన్నారు. ఆయా ప్రాంతాల్లోని రైతులకు సహాయం చేసేలా పాలకుల మనసు మార్చాలని స్వామి వారిని కోరుకున్నానని చెప్పారు. రైతాంగాన్ని ఆదుకుని.. దేశ సంపదను పెంచాలని తమ ప్రభుత్వం కూడా యోచిస్తోందన్నారు.

### మనవడి పుట్టెంట్రుకల మొక్కు కోసం..

మంగళవారం రాత్రే కుటుంబ సభ్యులతో కలసి తిరుమలకు చేరుకున్న సీఎం రేవంత్.. బుధవారం ఉదయం మనవడి పుట్టెంట్రుకల మొక్కుని చెల్లించారు. అనంతరం సతీమణి, కుమార్తె, అల్లుడు కుటుంబ సభ్యులతో కలిసి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆయన ఆలయంలోకి వెళ్లారు. ధ్వజస్తంభాన్ని తాకుతూ గర్భాలయానికి చేరుకున్నారు. అక్కడ మూలమూర్తిని దర్శించుకుని హుండీలో కానుకలు సమర్పించారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు రేవంత్ కుటుంబానికి ఆశీర్వచనం చేశారు. ఈవో ధర్మారెడ్డి వారికి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన రేవంత్ మనవడిని భుజంపైకి ఎత్తుకుని సంబరపడ్డారు. మిగతా.. 2లో




### విపక్షాలకు అధికారమిస్తే

# జన్‌ధన్ ఖాతాలు కట్

- మీ నగదును బదిలీ చేసేసుకుంటారు
- విపక్ష కూటమి క్యాన్సర్ కన్నా డేంజర్
- యూపి ప్రచారంలో ప్రధాని మోడీ హెచ్చరిక

**లక్నో,మే22(నమస్తే ఉదయం):** ప్రతిపక్షాలు అధికారంలోకి వస్తే జనధన్ బ్యాంక్ ఖాతాలు మూసి వేసి అందులోని నగదు లాగేసుకొంటాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. తన ప్రభుత్వ హయాంలో పేదవారి కోసం దాదాపు 50 కోట్లకు పైగా జనధన్ యోజన ఖాతాలను ప్రారంభించానని తెలిపారు. బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని శ్రావస్థిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఆ ఖాతాలన్నీ ప్రతిపక్షాలు మూసి వేస్తాయని ప్రధాని మోదీ స్పష్టం చేశాయి. ప్రధానిగా తాను దేశంలో ప్రతీ గ్రామానికి విద్యుత్ సరఫరా తీసుకు వచ్చానన్నారు. అదే ప్రతిపక్షం అధికారంలోకి వస్తే మాత్రం ఆ యా గ్రామాలన్నీ విద్యుత్ కోతల ద్వారా చీకటిలోకి నెట్టేస్తాయని విమర్శించారు. ఇక ప్రతీ ఇంటికి తాను కుళాయి ద్వారా నీళు అందించానని గుర్తు చేశారు. అయితే ఇంటికి దూరంగా నీటి కుళాయిలు ఏర్పాటు చేయ గల నైపుణ్యంలో ప్రతిపక్షాలు పేరు సంపాదించాయని చెప్పారు. ఇక 4 కోట్ల మంది పేద ప్రజలకు కోసం నిర్మించిన ఇళ్లు.. ఎస్పీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాళ్ల ఓటు బ్యాంక్‌కు కట్టబెడతారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఏం చేసినా.. దానికి విరుద్దంగా చేయడం ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల ప్రత్యేకత అని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాదిస్తే.. ప్రస్తుతం జైల్లో ఉన్న తీవ్రవాదులందరని.. ప్రధానమంత్రి తన నివాసంలో బిర్యానీ తినేందుకు ఆహ్వానిస్తారన్నారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల ర్యాలీలో పాల్గొంటున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌లపై ప్రధాని మోదీ ఈ సందర్భంగా వ్యంగ్య బాణాలు సంధించారు. మిగతా.. 2లో



# చార్‌ధామ్ యాత్రికులకు నిరాశ

- ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ మూసివేతతో ఇబ్బందులు
- మే 31న తెరచుకోనున్న రిజిస్ట్రేషన్

**డెహ్రాడూన్,మే22(నమస్తే ఉదయం):** హిందువులు ఎంతగానో ఎదురుచూసే చార్ ధామ్ కేదార్నాథ్ ఆలయ తలుపు తెరచుకోవడంతో ప్రారంభమైంది. ఉత్తరాఖండ్‌లోని చార్ ధామ్ యాత్రకు దేశ నలుమూలల నుంచి మాత్రమే కాదు విదేశాల నుంచి కూడా భక్తులు వస్తున్నారు. ఊహించిన దానికంటే యాత్రలో భారీ సంఖ్యలో భక్తులు యాత్రకు పోటెత్తుతున్నారు. దీంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మే 31 వరకు ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం నిషేధించింది. చార్ ధామ్ యాత్ర కోసం హరిద్వార్, డెహ్రాడూన్‌లలో రవాణా శిబిరాలు ఏర్పాటు చేసారు. గత కొన్ని రోజులుగా ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు.నాలుగు ధామ్‌లలో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆఫ్‌లైన్ మిగతా.. 2లో



# గాడి తప్పుతున్న నేతల ప్రచారం

- ప్రధాన పార్టీల తీరుపై ఇసి ఆగ్రహం
- కాంగ్రెస్, బిజెపి అధ్యక్షులకు నోటీసులు

**న్యూఢిల్లీ,మే22(నమస్తే ఉదయం):** సార్వత్రిక ఎన్నికల ప్రచారాల్లో నిమగ్నమైన ప్రధాన రాజకీయ పార్టీలు.. విమర్శనాస్త్రాలతో ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్నాయి. ఈ క్రమంలో అగ్ర నేతలు, ముఖ్య ప్రచారకర్తలు చేసే ప్రసంగాలు గాడి తప్పుతున్నాయంటూ ఎన్నికల సంఘం కన్నెర్ర చేసింది. ప్రచారాల్లో కుల, మత ప్రస్తావనలను తీసుకురావడంపైనా విరుచుకుపడింది. నేతల ప్రచారశైలిలో మార్పు రావడం లేదని, ఇకనైనా సరిదిద్దుకోవాలని పేర్కొంటూ భాజపా, కాంగ్రెస్ జాతీయాధ్యక్షులకు నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ప్రచారాల్లో మతపరమైన అంశాలకు దూరంగా ఉండాలని భాజపా, కాంగ్రెస్ పార్టీలకు ఎన్నికల సంఘం సూచించింది. ముఖ్యంగా సమాజంలో విభజనకు దారితీసే ప్రసంగాలను వెంటనే ఆపాలని మిగతా.. 2లో




# బోనస్‌తో వడ్లు కొనేందుకు ఎందుకు జాప్యం..?

- ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల వడ్లు కొనాల్సిందే
- ధాన్యం సేకరణకు కేంద్రం సిద్దంగా ఉంది
- మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,మే22(నమస్తే ఉదయం):** రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నేతలు రైతులను మోసం చేస్తున్నారని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి.. ఇప్పుడు ఆగస్టు 15లోగా అమలు చేస్తామని అంటున్నారని ఎద్దేవా చేశారు. సన్న వడ్లకే బోనస్ అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు. రాష్ట్రంలో 80 శాతం దొడ్డు వడ్లనే పండిస్తారని చెప్పారు. చాలా తక్కువ మంది రైతులే సన్న రకం పండిస్తారని తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..దొడ్డు వడ్లను కొనుగోలు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. వాటిని కొనేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటన్నారు. ఈ ప్రభుత్వం బోనస్ పేరుతో అన్నదాతలను మోసం చేసింది. మిగతా.. 2లో



# మమత సర్కార్‌కు భారీ షాక్

- 2010 తరవాత జారీ చేసిన ఓబిసి సర్టిఫికెట్ల రద్దు
- కోల్‌కతా హైకోర్టు సంచలన తీర్పు
- తీర్పును అంగీకరించమన్న మమతా బెనర్జీ

**కోల్‌కతా,మే22(నమస్తే ఉదయం):** లోక్‌సభ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో 26వేల మంది టీచర్ల ఉద్యోగాలు రద్దు చేసిన కలకత్తా హైకోర్టు బుధవారం మరో సంచలన తీర్పు వెలువరించింది. ఓబీసీలో పలు క్లాసులను కొట్టివేసింది. 2010 తర్వాత నుంచి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అన్ని ఓబీసీ ధ్రువపత్రాలను రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. 2012 నాటి పశ్చిమ బెంగాల్ వెనకబడిన వర్గాల చట్టంలోని కొన్ని నిబంధనలు చట్టవిరుద్ధంగా ఉన్నాయంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం.. 2010–12 మధ్య రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీ మిగతా.. 2లో

# కల్లాల్లో పడిగాపులు

### వర్షాలు పడతాయని హెచ్చరికలు

- ధాన్యం కొనుగోళ్లలో కదలని అధికారులు
- సన్నాలకే బోసన్ అంటూ మెలిక పెట్టడం సరికాదు
- బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్దిపేట,మే22(నమస్తే ఉదయం):** తుఫాన్ ప్రభావంతో వచ్చే మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా ప్రభుత్వం మాత్రం రోజుల తరబడి వడ్లు కొనకపోవడం వల్ల వడ్లు తడిచే అవకాశం ఉందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మీడియాతో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు కల్లాల్లో పడిగాపులు కాచే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తడిసిన వడ్లతో సహా అన్ని వడ్లను కొంటున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరేలా ఉందన్నారు. చిన్నకోడూరు కేంద్రాల్లో రైతులు 20 రోజులుగా వేచి చూస్తున్నారని చెప్పారు. ధాన్యం ఒకటికి రెండుసార్లు తడిసి మొలకెత్తింది.



ధాన్యం రైస్ మిల్లుకు వెళ్లాక తేమ శాతం ఎక్కువ ఉందని, మొలకెత్తిందని మిగతా.. 2లో

# మరోమారు అధికారం ఎన్‌డిఏదే

- భారత్ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుదల
- బీజేపీ 305 సీట్లు గెలుచుకుంటుంది
- అమెరికన్ పొలిటికల్ సైంటిస్ట్ అంచనా

**న్యూఢిల్లీ,మే22(నమస్తే ఉదయం):** లోక్‌సభ ఎన్నికలు తుది దశకు వచ్చాయి. మరో రెండు విడతల్లో దేశంలోని 543 ఎంపీ స్థానాలకు ఎన్నికలు ముగియనున్నాయి. అయితే, ఈ సారి ఎన్నికల్లో మొత్తం అంకెల చుట్టూ తిరుగుతోంది. బీజేపీ స్వయంగా 370 సీట్లు, ఎన్డీయే కూటమి మొత్తంగా 400 కన్నా ఎక్కువ స్థానాలు గెలుస్తుందని బీజేపీ నేతలు చెబుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈసారి బీజేపీ కేవలం 200 కన్నా తక్కువ స్థానాలకే పరిమితమవుతుంది, ఇండియా కూటమి 300 స్థానాలను కన్నా ఎక్కువ గెలుచుకుని అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తోంది. వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ మిగతా.. 2లో



# చేసిన పనులు చెప్పకోలేక ఓడాం

- కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు బాధపడుతున్నారు
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్

**నర్సంపేట,మే22(నమస్తే ఉదయం):** మా ప్రభుత్వ హయాంలో చేసిన మంచి పనులు చెప్పుకోలేక.. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి కూడా యువతకు దూరమయ్యాం. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పెంచి కూడా వారికి దూరమయ్యాం. ఇలా చేసింది చెప్పుకోలేక ఓడిపోయామన్నారు. నర్సంపేటలో ఏర్పాటు చేసిన వరంగల్– నల్లగొండ –ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచార సభలో కేటీఆర్ పాల్గొని పార్టీ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా ప్రసంగించారు. ఈ ఎన్నికలతో ఫలితంలో ప్రభుత్వం కూలిపోయేది లేదు. మిగతా.. 2లో

# 2 రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలి

మొదటిపేజీ తరువాయి..

ఆలయం ముందున్న అభిమానులను పలకరిస్తూ తిరిగి అతిథి గృహానికి చేరుకున్నారు. కొంత సమయం విశ్రాంతి తర్వాత తిరుమల నుంచి తిరుగుపయనమయ్యారు.

### తీన్మార్ మల్లన్న భారీ మెజారిటీతో గెలవాలి : సీఎం దిశానిర్దేశం

ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని, తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో బుధవారం సీఎం మూడు ఉమ్మడి జిల్లాల నాయకులతో జూమ్ ద్వారా సమావేశమయ్యారు. మూడు ఉమ్మడి జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జులు ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఎమ్మెల్యే తమ అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లను సందర్శించాలని సూచించారు. నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తీన్మార్ మల్లన్న ప్రభుత్వానికి వారధిగా పని చేస్తారని, ఆయన గెలుపు.. సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతుందన్నారు. 27న పోలింగ్ నేపథ్యంలో క్షేత్ర స్థాయి కార్యకర్తలను సన్నద్ధం చేయాలన్నారు.

# విపక్షాలకు అధికారమిస్తే జన్‌ధన్ ఖాతాలు కట్

మొదటిపేజీ తరువాయి..

వీరిద్దరు పాల్గొంటున్న బహిరంగ సభలకు భారీగా జనం తరలివచ్చిన కొన్ని వీడియోలను తాను చూశానని ప్రధాని మోదీ తెలిపారు. ఈ సభలకు హాజరయ్యేందుకు ఈ రెండు పార్టీలు ప్రజలకు నగదు పంచి పెడుతున్నాయని.. అందుకే వారంతా వస్తున్నారని మోదీ విమర్శించారు. ప్రజలకు నగదు ఇవ్వకుండా ర్యాలీలకు తీసుకు రావాలని ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల నేతలకు ప్రధాని మోదీ సూచించారు. అయితే వాళ్ల పరిస్థితి ఇలా ఉంటే.. వారు మీ కోసం ఏం పని చేస్తారంటూ ప్రజలను ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రశ్నించారు. అలాగే విపక్ష ఇండియా కూటమి క్యాన్సర్ కంటే ప్రమాదకారి అని, అది వ్యాపిస్తే దేశాన్నే నాశనం చేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. విపక్ష ఇండియా కూటమికి మతతత్వం, తీవ్ర జాతి వివక్ష, బంధుప్రీతి వంటి వ్యాధులున్నాయన్నారు. ఇవి క్యాన్సర్ కంటే ప్రమాదకరమైన వ్యాధులన్నారు. మోదీ దేశవ్యాప్తంగా 4 కోట్ల మంది పేదలకు ఇళ్ళు ఇచ్చారని, ఇప్పుడు సమాజ్‌వాది, కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే అన్నింటినీ తారుమారు చేస్తారని హెచ్చరించారు. విపక్షాలు గెలిస్తే పేదలకు తాము నిర్మించిన ఇళ్లను గుంజుకుని వాటిని తమ ఓటు బ్యాంకుకు పంచివేస్తాయని ఆరోపించారు. తాను ప్రారంభించిన 50 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలను మూసివేసి ఆ డబ్బును వారు లాగేసుకుంటారని విమర్శించారు. మోడీ ప్రతి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తే విపక్షాలు విద్యుత్ కనెక్షన్లను కట్ చేసి మళ్లీ చీకట్లోకి తీసుకువెళతాయన్నారు.

# గాడి తప్పుతున్న నేతల ప్రచారం

మొదటిపేజీ తరువాయి..

భాజపాకు స్పష్టం చేసింది. రాజ్యాంగం రద్దవుతుందనే తప్పుడు అభిప్రాయం కలిగించే ప్రకటనలకు దూరంగా ఉండాలని కాంగ్రెస్‌ను ఆదేశించింది. అగ్నివీర్ వంటి పథకాలపై ప్రసంగాలు చేసేటప్పుడు.. సాయుధ బలగాలను రాజకీయం చేయవద్దని పేర్కొంది. భాజపా, కాంగ్రెస్‌లు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం, వాటిని సమర్థించుకోవడాన్ని ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. అధికారంలో ఉన్న పార్టీ మరింత బాధ్యతగా వ్యవహరించాలన్న ఈసీ.. ప్రతిపక్ష పార్టీకీ ఈ విషయంలో మినహాయింపు లేదని పేర్కొంది. ఎన్నికల వ్యవస్థపై భారత ఓటరుకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలను ఈసీ ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించదని స్పష్టంచేసింది. ఈ క్రమంలోనే ప్రచారాల్లో సంయమనం పాటించి, ప్రసంగాలను సరిచేసుకునేలా స్టార్ క్యాంపెయినర్లకు సూచించుకోవాలని రెండు జాతీయ పార్టీలకు ఈసీ సూచించింది.

# చార్‌ధామ్ యాత్రికులకు నిరాశ

మొదటిపేజీ తరువాయి..

రిజిస్ట్రేషన్ మే 31 వరకు మూసివేయనున్నామని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి స్పష్టం చేశారు. దీంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న యాత్రికులు మాత్రమే ప్రస్తుతం యాత్రకు వెళ్లగలరు. ఇటువంటి పరిస్థితిలో ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న భక్తులు తమరిజిస్ట్రేషన్ కోసం తదుపరి ప్రభుత్వ ఉత్తర్వుల వరకు వేచి ఉండవలసి ఉంటుంది.. మరో వారం రోజుల పాటు కోసం వేచిచూడాలి. డెహ్రాడూన్, హరిద్వార్ జిల్లాల్లో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ క్యాంపులను ఏర్పాటు చేసింది. నిత్యం భారీ సంఖ్యలో భక్తులు ఇక్కడికి చేరుకుంటున్నారు. యాత్రకు వెళ్ళడానికి ఎంత సమయం అయినా ఈ శిబిరాల్లో వేచి చూస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.మే 31 వరకు చార్ ధామ్ కొత్త భక్తులను ఆహ్వానించవద్దని ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికే చేరుకున్న వేలాది మంది పర్యాటకులు హరిద్వార్‌లోని హోటల్ ధర్మశాలలో ఉన్నారు. రిజిస్ట్రేషన్ తెరిచే సమయం కోసం వేచి చూస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో హరిద్వార్ టూర్ అండ్ ట్రావెల్స్ వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# కల్లాల్లో పడిగాపులు

మొదటిపేజీ తరువాయి..

కొనడం లేదని పేర్కొన్నరు. ఒక వేళ కొన్నా తరుగు తీసేయడం వల్ల సంచికి మూడు కిలోలు కోతపెట్టే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. తరుగు లేకుండా వెంటనే వడ్లు కొనాలని డిమాండ్ చేశారు. చిన్నకోడూరు రైతులతో మాట్లాడినప్పుడు ఇంటి అవసరాలకు మాత్రమే సన్న వడ్లు పండిస్తామని, మిగతా వడ్లన్నీ దొడ్డువడ్లేనని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు కాంగ్రెస్ అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం సన్నవడ్లకే ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లాలో 3,38,389 ఎకరాల్లో వరి సాగయింది. 3 లక్షల 29 వేల ఎకరాల్లో దొడ్డు రకం వేశారు. 16 వేల ఎకరాల్లో మాత్రమే సన్నరకం వేశారు. రూపాయికి 95 శాతం దొడ్డువడ్లు పండించే వాళ్లకు బోనస్ ఎగ్గొట్టి , కేవలం ఐదు శాతం సన్నబడ్లు పండించే వాళ్లకు బోనస్ ఇస్తామనడం రైతులను దగా చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. విత్తానాల కోసం రైతుల పాస్ పుస్తకాలు లైన్లో పెట్టి వేచి చూసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మంత్రులు కల్లాల్లో తిరిగేవాళ్లు. ఇప్పుడు ఒక్క మంత్రి కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించడం లేదని విమర్శించారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్న విషయం తెలుసుకోవడానికి మంత్రులు కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని డిమాండ్ చేశారు.అన్ని రకాల వడ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రైతులకు వడ్ల బోనస్ విషయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. డబ్బాలో ఓట్లు పడి, సీల్ పడ్డాక రైతులకు చావు కబురు చల్లగా చెబుతున్నారని ధ్వజమెత్తారు. చిన్న కోడూరు మండల కేంద్రంలో బుధవారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, రైతులతో హరీశ్‌రావు మాట్లాడి వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. అధికారంలోకి రావడానికి బాండ్ పేపర్ మీద 6 గ్యారెంటీలను రాసిన విధంగానే సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం బోనస్ విషయంలో ఆలోచించి సన్నవడ్లకే కాకుండా దోడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులను రైతులు గ్రామాల్లో నిలదీస్తారని అన్నారు. తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# మారిన టిఎస్ ఆర్టీసీ పేరు

## ఇకనుంచి టిజిఎస్ ఆర్టీసీగా మార్పు

**హైదరాబాద్,మే22(నమస్తేఉదయం):** తెలంగాణ ఆర్టీసీ పేరులో మార్పు చోటుచేసుకుంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్పు చేస్తూ నిర్ణయం తీసుకున్నది. ఇప్పటి వరకు టీఎస్ ఆర్టీసీగా కొనసాగగా.. ప్రస్తుతం టీజీఎస్‌ఆర్టీసీగా మారింది. ఇటీవల ప్రభుత్వం టీఎస్ స్థానంలో టీజీగా మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇక నుంచి నివేదికలు, ప్రభుత్వ ఉత్తర్వులు, లెటర్ హెడ్‌లపై టీఎస్‌కి బదులు టీజీగా పేర్కొనాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్రం అనుమతి ఇస్తూ గెజిట్ జారీ చేసిన విషయం తెలిసిందే. గతంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల బోర్డులు, ప్రభుత్వ పరంగా టీఎస్‌గా రాసే విషయం తెలిసిందే. గతేడాది డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్ స్థానంలో టీజీని మార్పు చేస్తూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. కేంద్రం అనుమతులు జారీ చేసిన విషయం తెలిసిందే.

# మరోమారు అధికారం ఎన్‌డిఏదే

మొదటిపేజీ తరువాయి..

కూడా బిజెపి 300కు పైగా సీట్లను గెల్చుకుంటుందని విశ్లేషణ చేశారు. ఈ క్రమంలో 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 305 గెలుచుకుంటుందని అమెరికన్ పొలిటికల్ సైంటిస్ట్, గ్లోబల్ పొలిటికల్ రిస్క్ కన్‌స్టలెంట్ ఇయాన్ బ్రెమ్మర్ మంగళవారం జాతీయ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రపంచ రాజకీయ దృక్కోణం లో భారత సార్వత్రిక ఎన్నికలు స్థిరంగా కనిపించే ఏకైక విషయమని, మిగతావన్నీ అమెరికా ఎన్నికలతో సహా సమస్యాత్మకంగా కనిపిస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం భౌగోళిక రాజకీయాలు నిశ్చితిలో ఉన్నాయని అన్నారు. ప్రపంచీకరణ కంపెనీలు కోరుకున్న విధంగా జరగడం లేదని చెప్పారు. రాజకీయాలు ప్రపంచ మార్కెట్లోకి ప్రవేశించడం..యుద్ధాలు, యూఎస్-చైనా సంబంధాలు, అమెరికా ఎన్నికలు అన్నీ ఇందులో భాగమే అని అన్నారు.

ఈ ఒత్తిళ్లు మరింత ప్రతీకూలంగా ఉన్నాయని, వాస్తవానికి రాజకీయంగా స్థిరంగా కనిపించే ఏకైక విషయం భారతదేశ ఎన్నికలే అని, మిగతావన్నీ సమస్యాత్మకంగా ఉన్నాయని చెప్పారు. ఏడు దశల్లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 295-315 సీట్లు గెలుస్తుందని అంచనా వేశారు. ఇదిలా ఉంటే ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కూడా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి మరోసారి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు.

2019లో సాధించిన సీట్లకు అటూ ఇటూగా లేదా, దాని కన్నా కొన్ని స్థానాలు ఎక్కువగా బీజేపీ గెలుచుకుంటుందని, ఆ పార్టీ చెప్పినట్లు 370 సీట్లు సాధించలేదని చెప్పారు. ప్రపంచంలోని పలు దేశాల్లో ఎన్నికలు ఉన్నాయని, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ సున్నితమైన ఎన్నికల ప్రక్రియను కలిగి ఉందని బ్రెమ్మర్ ప్రశంసించారు. బలమైన ఆర్థిక పనితీరు, స్థిరమైన సంస్కరణలతో మోడీ మూడోసారి గెలువబోతున్నారని అన్నారు. దశాబ్దాలుగా భారత్ పనితీరును పలు దేశాలు తక్కువగా చూసినప్పటికీ, ప్రస్తుత అమెరికన్ సీఈఓలు భారత్ వస్తున్నారని, తాము వృద్ధిని చూస్తున్నామని, భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడాన్ని చూశామని, బహుశా 2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించొచ్చని ఆయన అన్నారు. మిగిలిన దేశాలతో తన స్నేహాన్ని నిర్వహించే విషయంలో భారత్ శక్తివంతంగా మారడాన్ని ప్రపంచం చూస్తోందని చెప్పారు.

# మమత సర్కార్‌కు భారీ షాక్

మొదటిపేజీ తరువాయి..

వర్గీకరణలుగా పేర్కొన్న 42 క్లాసులను కొట్టివేస్తున్నట్లు వెల్లడించింది. ఆ వర్గీకరణలు చట్టవిరుద్ధంగా ఉన్నాయని స్పష్టం చేసింది. అందువల్ల 2010 తర్వాత ఈ క్లాసుల కింద జారీ చేసిన ఓబీసీ సర్టిఫికెట్లన్నిం టిని రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. 1993 నాటి వెనకబడిన వర్గాల చట్టానికి అనుగుణంగా కొత్త ఓబీసీ జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.

అయితే, ఈ క్లాసులతో జారీ అయిన ఓబీసీ ధ్రువపత్రాలతో ఇప్పటికే ప్రయోజనాలు పొందుతున్నవారు, ఆ రిజర్వేషన్ల కింద ఉద్యోగాలు చేస్తున్నవారిపై ఈ తీర్పు ఎలాంటి ప్రభావం చూపదని న్యాయస్థానం వెల్లడించింది. 1993లో చేసిన చట్టానికి విరుద్ధంగా పత్రాలు జారీ చేశారని న్యాయమూర్తులు తపబ్రత చక్రవర్తి, రాజశేఖర్ మంతాతో కూడిన హైకోర్టు ధర్మాసనం తమ తీర్పులో స్పష్టం చేసింది. అయితే, తమ ఉత్తర్వుల ప్రభావం ఇప్పటికే ఉద్యోగాలు, పథకాల లబ్ధి పొందిన వారిపై ఎటువంటి ప్రభావం చూపవని తెలిపింది. 2010కి ముందు 66 తరగతులుగా క్లాసిపై చేసిన ఓబీసీల జోలికి తాము వెళ్లడం లేదని, పిటిషన్‌లో వాటిని సవాలు చేయలేదని ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసంతృప్తి వ్యక్తంచేశారు. దీన్ని తాము అంగీకరించబోమని తెలిపారు. ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహించి బిల్లు తీసుకొచ్చాం. రాజ్యాంగానికి లోబడి తీసుకొచ్చిన ఈ బిల్లును శాసనసభ ఆమోదించింది. ఇప్పుడు భాజపా కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి దీన్ని నిలిపివేయాలని కుట్ర పన్నింది. ఈ తీర్పును మేం అంగీకరింబోం. ఓబీసీ రిజర్వేషన్లు కొనసాగుతాయని దీదీ స్పష్టంచేశారు.

# బోనస్‌తో వడ్లు కొనేందుకు ఎందుకు జాప్యం..?

మొదటిపేజీ తరువాయి..

కేంద్రం అన్ని రకాలుగా వారికి అండగా ఉంది.

రబీ సీజన్‌లో పెద్ద మొత్తంలో ధాన్యం సేకరించాలని కేంద్రం ఒప్పందం కుదుర్చుకుంది. గతంలో భారాస, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయి. ధాన్యం తడిచి మొలకెత్తుతున్నా, కొనుగోలు కేంద్రాలకు తరలించి వారాలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. మార్కెట్‌యార్డుల వద్ద అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారు. మంగళవారం 75 వేల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొనేందుకు మరో 2 నెలలు పడుతుంది. వర్షాలు పడి ధాన్యం మొలకలు వస్తుంటే బాధ్యులు ఎవరని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. బోనస్ ఇచ్చి కొనడానికి మీకు బాధ ఏంటని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. తెలంగాణ రైతులను మరో సారి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. వంద రోజుల్లో రుణమాఫీ చేస్తామని చెప్పి రైతుల్ని దగా చేసిందన్నారు. కౌలు రైతులకు 15 వేలు ఇస్తామని చెప్పారు? వరికి క్వింటాల్ కు 500 బోనస్ ఇస్తామని చెప్పి యే ఒకటి కూడా అమలు చేసేలా లేదన్నారు. రైతులను నయవంచన చేసి అధికారం లోకి కాంగ్రెస్ వచ్చిందన్నారు. దేవుడి పేరుతో ఓట్లు పెడుతూ ప్రజలకి మాత్రం పంగనామాలు పెడుతుంది ఈ ప్రభుత్వం అని మండిపడ్డారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ అని సన్నాయి నొక్కులు నొక్కుతుందన్నారు.చెయ్యి గుర్తుకు ఓటు వేసినందుకు రైతులకు చేయి ఇస్తుంది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎంత ధాన్యం పండిన యే రకం అయినా కేంద్రం కొంటుంది? రైతులకు అండగా కేంద్రం ఉంటుంది? డబ్బులు చెల్లిస్తుందన్నారు. రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెన్నుపోటు పొడుస్తుంది .. దుర్మార్గం అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం మేరకు 22 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఖరీఫ్ సీజన్ ది రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఇవ్వలేదన్నారు. రబీలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ఒప్పందం చేసుకుంటే 33 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించింది ఈ ప్రభుత్వం అన్నారు. అకాల వర్షాలతో ధాన్యం మొలకెత్తిన ? కొనుగోలు మాత్రం నామ మాత్రంగా నత్తనడకన నడుస్తుంది?రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న కోనుగులు చేసింది 75 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే అన్నారు. సోనియమ్మ రాజ్యం అంటే రైతుల కన్నీళ్లు చూడడమా అని మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వం ధాన్యం ఎఫ్‌సిఐకి చేరే వరకు అయ్యే ఖర్చు మొత్తం భరుస్తుంది? రాష్ట్ర ప్రభుత్వం మీద ఒక్క పైసా కూడా భారం కూడా పడదు? ఇంకా కమిషన్ ఇస్తుంది కేంద్రం? కమిషన్ డబ్బులతో నే ఉద్యోగులకు జీతాలు ఇస్తుంది రాష్ట్ర ప్రభుత్వం అన్నారు. దొడ్డు రకం వేస్తే అడ్డుకుంటామని సీఎం అంటున్నారని తెలిపారు. ఇప్పుడు ఎందుకు బోనస్ చెల్లించడం లేదో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ చెప్పాలన్నారు. మీ గారెంటీలు గారడీలు కాకుంటే తెలంగాణ ఓట్ల మీద మీకు గౌరవం ఉంటే ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఇప్పుడు కళ్ళాలలో ఉన్న దాన్యం కు బోనస్ చెల్లించి కోనాల్సిందే అని డిమాండ్ చేశారు. ధాన్యం మీద కనీస ధర 61 శాతం కేంద్ర ప్రభుత్వం పెంచిందన్నారు. సన్న బియ్యం కి వెయ్యి బోనస్ ఇవ్వాలన్నారు. మిగతా ధాన్యానికి 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వం వెయ్యి రూపాయల బోనస్ ఇస్తుందన్నారు. రుణమాఫీ చేయని కారణంగా రైతులు కొత్తగా రుణం తెచ్చుకునే పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు రైతులు అప్పులు ఎక్కడ తెచ్చుకోవాలి? రైతు బతుకు ఏంది? అని ప్రశ్నించారు. ఆగస్టు లో రుణమాఫీ చేస్తారనే నమ్మకం లేదన్నారు. ఆగస్టు వరకు వర్షాలు పడకుండా రేవంత్ రెడ్డి ఏమైనా ఆపుతారా? అని వ్యంగాస్త్ర వేశారు. 6 గ్యారంటీల పై సోనియమ్మ సంతకంతో ఇంటింటికి లెటర్ రాసింది కాంగ్రెస్ అన్నారు. భారత దేశాన్ని మోసం చేస్తున్న చరిత్ర కాంగ్రెస్ అని తెలిపారు. కాంగ్రెస్ ఆలోచన గుంట నక్క కన్నా ఎక్కువగా ఉంటుందన్నారు.ఎన్ని తరాలు మారినా కాంగ్రెస్ తీరు మారదన్నారు. 15 వందల తెలంగాణ బిడ్డల ప్రాణాలు తీసినందుకు సోనియా గాంధీ నీ జూన్ 2 న ఆవిర్భావ దినోత్సవం కు పిలుస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమానికి సోనియా గాంధీ ఎలా వస్తారు? అని మండిపడ్డారు. తెలంగాణను ప్రజలు దంచి తెచ్చుకున్నారు? సోనియా ఇవ్వలేదన్నారు. సోనియా వారసత్వ రాజకీయాలకు నాయకురాలు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రజల పోరాటం చేసి సుష్మ స్వరాజ్ పోరాటం తో తెలంగాణ వచ్చిందన్నారు. మార్కెట్ యార్డు లు విజిట్ చేస్తానని కిషన్ రెడ్డి అన్నారు.

# చేసిన పనులు చెప్పుకోలేక ఓడాం

మొదటిపేజీ తరువాయి..

తారుమార అయ్యేది లేదు. 6 నెలల క్రితం అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. కేసీఆర్‌తో సహా అందరం ప్రతి నియోజవర్గంలో పర్యటించాం. దయచేసి మోసపోకండి.. గోసపడుతామని చెప్పాము. కానీ ప్రజలు కాంగ్రెస్ వాగ్దానాలు నమ్మి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు. ఇప్పుడు బాధపడుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

చదువుకున్న విద్యావంతులు కాంగ్రెస్ పాలన గురించి ఆలోచించాలని కోరుతున్నాను. ప్రస్తుతం వ్యవసాయం పరిస్థితి ఏంటో ఆలోచించండి. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అందమైన నినాదాలు ఎక్కడున్నాయో ఆలోచించండి. నాకు ఓటు వేస్తే 2 లక్షల రుణమాఫీ దస్త్రంపై డిసెంబర్ 9న తొలి సంతకం చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చాడు. అర్జంట్‌గా బ్యాంక్‌కు వెళ్లి 2 లక్షల రుణం తెచ్చుకోవాలని కూడా సూచించారు. డిసెంబర్ 9 పోయింది.. మరో పది రోజులు అయితే జూన్ 9 వస్తది. ఆరు నెలలు గడిచిపోతది. తొలిరోజే సంతకం చేస్తానని మోసం చేసిన రేవంత్ రెడ్డి నిలబెట్టిన అభ్యర్థి పట్ల ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో ఆలోచించాలని గ్రాడ్యుయేట్లను కేటీఆర్ కోరారు. రైతు భరోసా 15 వేలు ఇస్తా.. భూయజమాలకు కాదు కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తానని రేవంత్ నమ్మబలికాడు. రైతు కూలీలకు ఏడాదికి 12 వేలు ఇస్తానని అన్నాడు. కౌలు రైతులకు రైతు భరోసా రాలేదు. తొలిసారి మోసపోతే మోసం చేసినోడిది తప్పు. రెండోసారి కూడా వాడి చేతిలో మోసపోతే మనది తప్పు అయితదని కేటీఆర్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే టెట్ పరీక్ష ఫీజు రూ. 20 వేలు చేస్తరని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ ఓటుతో ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఒక గళాన్ని మండలికి పంపించాలని కేటీఆర్ కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తా అన్నాడు. 50 వేలతో మెగా డీఎస్సీ అన్నాడు. ఈ రెండు అమలు కాలేదు. కానీ 30 వేల ఉద్యోగాలు ఇచ్చాను అంటున్నారు. అవి కేసీఆర్ ఇచ్చిన




ఉద్యోగాలు. లీగల్ సమస్యల వల్ల ఆగిపోయాయి. కేవలం కాగితాలు ఇచ్చి తాను ఇచ్చానని ఊదరగొడుతున్నారు. విచక్షణ కలిగిన విద్యావంతులు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. సమాజానికి దిక్సూచిగా ఉంటూ, దిశానిర్దేశం చేసేది మీరే.. మీరు కూడా మళ్లీ మోసపోతారా..? లేదా మేల్కొని ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారికి అవకాశం ఇస్తారా..? ఆలోచించుకోవాలి.

బీఆర్ఎస్ తరపున రాకేశ్ రెడ్డికి కేసీఆర్ అవకాశం ఇచ్చారు. రాకేశ్ రెడ్డి సామాన్య రైతు కుటుంబంలో పుట్టారని అన్నారు. తెల్లారి లేస్తే బూతులు తిట్టుడు, వెకిలి పనులు చేసుడు కాంగ్రెస్ అభ్యర్థి లక్షణం. దందాలు చేయడం, బెదిరించడం వంటి కేసులు నమోదైనట్లు కాంగ్రెస్ అభ్యర్థి అఫిడవిట్‌లో ఉన్నాయి. తీన్మార్ మల్లన్న అఫిడవిట్‌లో 56 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆడపిల్లల ఫొటోలు మార్ఫింగ్ చేసిన కేసులు, అనుమతి లేకుండా అమ్మాయిల ఫోన్ నంబర్లను ఫేస్‌బుక్‌లో పెట్టిన కేసులు, బ్లాక్ మెయిల్ చేసిన కేసులు.. ఇలా 56 క్రిమినల్ కేసులు ఉన్న మహానుభావుడికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చింది. కాబట్టి అభ్యర్థుల గుణగణాలు చూడాలి. మండలిలో వైట్ కాలర్ వర్కర్ ఉండాల్నా.. బ్లాక్ మెయిలర్ ఉండాల్నా ఆలోచించండి. బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే నర్సంపేట యువత తరపున రేపు మండలిలో గల్లా పట్టి అడిగే పరిస్థితి మాత్రం ఉంటదని అన్నారు. నిరుద్యోగ భృతి ఎక్కడా అని ప్రభుత్వాన్ని నిలదీసే వాయిస్ ఉంటది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరు రైతు బిడ్డలుగా, విద్యావంతులుగా మోసాన్ని గ్రహించి ఓటేయకపోతే నష్టపోయేది మీరే. నోటిఫికేషన్లు ఇవ్వకపోయిన పట్టభద్రులు ఓటేశారు అని ప్రభుత్వం అనుకుంటది.

జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి ఇవ్వకపోయినా మాకు ఓటేశారు అనుకుంటారు. ఒక్క పరీక్షకు కూడా ఫీజు ఉండదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు టెట్ ఫీజు రూ. 400 ఉండే. ఇప్పుడు రూ. 2 వేలు అయింది. మళ్లీ వాళ్లకు ఓటేస్తే టెట్ ఫీజు రూ. 20 వేలు చేయరా..? ఆలోచించండి. పదేండ్లలో తెలంగాణలో ఎంతో ప్రగతి సాధించాం. కొత్త జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు, తండాలు గ్రామ పంచాయతీలు అయ్యాయి. ఐటీ ఎగుమతులు పెరిగాయి. పరిశ్రమలు వచ్చాయని కేటీఆర్ తెలిపారు.

# స్త్రీనిధిలో పాతుకు పోయిన రిటైర్డ్ ఉద్యోగులు

### అవకతవకల నేపథ్యంలో విచారణకు మంత్రి ఆదేశం

### కోడ్ ముగిసిన తరవాత చర్యలకు రంగం సిద్ధం

**వరంగల్,మే22 (నమస్తే ఉదయం):** తెలంగాణ స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్లో రిటైర్డ్ ఉద్యోగుల పెత్తనం, సిఎస్ఆర్ నిధుల మళ్లింపు, ఇతర అభియోగాల నేపథ్యంలో స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్ పై మంత్రి సీతక్క జనవరి నెలలో సమీక్ష నిర్వహించి స్త్రీనిధిలో అవినీతి ఆరోపణలపై విచారణకు ఆదేశించారు. ప్రస్తుతం ఆ సమాఖ్యకు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎ.జి.యం స్థాయి విశ్రాంత నాబార్డ్ అధికారి అయిన జి.విద్యాసాగర్ రెడ్డి గత 13 సంవత్సరాలుగా కొనసాగుతున్నారు. ఈయనతో పాటు ఉన్నత స్థాయిలో డి.జి.యం పోస్టుల్లో బి.విద్య సాగర్ రెడ్డి, నర్సింహ రెడ్డి, వెంకట్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, రాజరావ్, రవికుమార్, ఏర్రమల్ల.రమేష్ లాంటి అగ్రవర్ణ రిటైర్డ్ ఉద్యోగులు సంవత్సరాల తరబడి సంస్థలో పాతుకు పోయారని సమాచారం. రిటైర్డ్ ఉద్యోగులు ఏళ్లకు ఏళ్లు కొనసాగుతుండటం ద్వారా సంస్థలో వున్న సీనియర్ ఉద్యోగులకు ప్రమోషన్లు రాకపోవడటంతో పాటు వారి వేధింపుల వలన సుమారుగా 400 మంది ఉద్యోగులు రాజీనామా చేసి వెళ్లిపోవడం జరిగింది. ఇదే విషయమై పలుమార్లు పాత,కొత్త ప్రభుత్వానికి, మంత్రులకు, ముఖ్యమంత్రి ప్రజావాణిలో వరుసగా పిర్యాధులు వెళ్లిన నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. అంతే కాకుండా తమ హక్కుల గురించి ప్రశ్నించిన యస్సీ, ఎస్టీ బీసీ ఉద్యోగులను టార్గెట్ చేస్తూ వారిపై అక్రమ బదిలీలు, ప్రమోషన్ల నిరాకరణ, వారి ఫోన్లను ట్యాపింగ్ చేయడం, జీపీఎస్ ట్రాకింగ్ చేయడం, తప్పుడు ఫిర్యాదులు స్వీకరించి నిరాధార ఆరోపణలతో తప్పుడు వార్తలు వ్రాయించడం లాంటివి చేయడంతో వేధింపులు భరించలేక 6



గురు బాధిత ఉద్యోగులు జాతీయ రాష్ట్ర యస్సీ, ఎస్టీ, బిసి, మానవ హక్కుల కమిషన్ ,లేబర్ కమిషన్లను ఆశ్రయించడం జరిగింది. అంతే కాకుండా స్త్రీ నిధి బోర్డుకు అప్పీల్ చేసుకోగా బోర్డు సభ్యులు సానుకూలంగా స్పందిస్తూ స్త్రీనిధి కి చాలా సంవత్సరాల నుండి సేవా చేస్తున్నారు కాబట్టి తొలగించడం కాకుండా మైనర్ పెనాలిటిని విధించి విధుల్లోకి తీసుకోవాలనే తీర్మానం చేయాలని చెప్పగా స్త్రీ నిధి యం.డి విద్యాసాగర్ రెడ్డి అట్టి ప్రతిపాదనను ఒప్పుకోకుండ ప్రిన్సిపల్ సెక్రటరీ మీటింగ్ కు రాలేదనే సాకుతో ఆ నిర్ణయాన్ని అమలుచేయలేదు. తదుపరి సమావేశంలో 15 మంది డైరెక్టర్లు సానుకులంగా స్పందించినా ప్రిన్సిపల్ సెక్రెటరీ ఒప్పుకోలేదని అప్పీల్ రిజెక్ట్ చేయడం జరిగింది. ఈ విధంగా యస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులను టార్గెట్ చేస్తున్నా విషయాన్ని మంత్రి సీతక్క దృష్టికి సంస్థ ఉద్యోగులు, ఎస్సీ ఎస్టీ, బిసి కుల సంఘాల బాధ్యులు తీసుకువెళ్ళారు. ఈ క్రమములో ప్రభుత్వం అన్ని శాఖలలో, బోర్డులు, కార్పొరేషన్లలో పాతుకు పోయిన విశ్రాంత అధికారుల వివరాలు సేకరించి తొలగించేందుకు రంగం సిద్ధం చేసిందని తెలిసింది, మంత్రిగారు స్పందిస్తూ స్త్రీ నిధిలోని రిటైర్డ్ ఉద్యోగుల తొలగింపు అనేది కూడా ప్రభుత్వం దృష్టిలో వుంది కానీ ఎలక్షన్ కోడ్ కారణంగా నిర్ణయం తీసుకోలేకపోతున్నాము, కోడ్ ముగిసిన వెంటనే చర్యలు వుంటాయని తెలియజేశారు. స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ జి.విద్యాసాగర్ రెడ్డి తొలగింపు అనివార్యం కావడంతో, కేవలం మేనేజింగ్ డైరెక్టర్గా తొలగించడమే కాకుండా ఆయన పీరియడ్లో జరిగిన స్త్రినిధి లావాదేవీలను, నిధుల మళ్లింపు, ఐబీ ఫండ్, నైబర్ హుడ్ సెంటర్లు, వి.ఎల్.ఇ కమిషన్, పాలకుర్తి టైలరింగ్, శిక్షణ కార్యక్రమాలలో జరిగిన ఖర్చులు, జనరల్ బాడీ సమావేశం ఖర్చులు, కొనుగోలు లాంటి వాటిపై విజిలెన్స్ విచారణ జరపించి చర్యలు తీసుకోవాలని గిరిజన, ప్రజా సంఘాల కోరుతున్నారు.



జహంగీర్ పీర్ దర్గాలో పాతీయాలి ఇస్తున్న మైనార్టీ నాయకుడు ఫస్యుద్దీన్


## రంజిత్ రెడ్డి విజయం కోసం జహంగీర్ పీర్ దర్గాలో పాతియాలు ఇచ్చిన పసియుద్దిన్

**శంషాబాద్, మే 22 (నమస్తే ఉదయం):**
చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి విజయం సాధించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మొహమ్మద్ పసియుద్దిన్ జహంగీర్ పీర్ దర్గాలో పాతియాలు సమర్పించారు. గత ఐదు సంవత్సరాలలో రంజిత్ రెడ్డి చేవెళ్ల నియోజకవర్గం లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వాటిని తిరిగి కొనసాగించడం కోసం ప్రజలందరూ హస్తం గుర్తుకు ఓటు వేసి మద్దతు పలికారు అని అన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తున్న రంజిత్ రెడ్డిని రెండవసారి గెలవాలని కోరుతూ జహంగీర్ పీర్ దర్గాలో పాతియాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు పసియోద్దీన్ వివరించారు. గత ఐదు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా రంజక కార్యక్రమాలు అభివృద్ధి పనులు చూసి ప్రజలు కాంగ్రెస్కు పట్టం కట్టారని రంజిత్ రెడ్డి వరుసగా రెండోసారి విజయం సాధించి తీరుతారని ఆయన భీమా వ్యక్తం చేశారు.

## చేవెళ్ల బిజెపి ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి చేస్తున్న పరమేష్ గౌడ్

### కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కలిసిన బిజెపి నాయకులు.

**శంషాబాద్, మే 22(నమస్తే ఉదయం):**
శంషాబాద్ భారతీయ జనతా పార్టీ నాయకులు కొండా పరమేష్ గౌడ్ బుధవారం చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కలిశారు. బుధవారం



ఆయన నివాస గృహంలో కలిసి పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సరోజిని వివరించారు. భారతీయ జనతా పార్టీ అవార్డు నడుస్తున్నదని. ముఖ్యంగా మోడీ నాయకత్వాన్ని బలపరుస్తూ రాష్ట్ర ప్రజలందరూ ఏకపక్షంగా ఓటింగ్లో పాల్గొన్నారని పరమేష్ గౌడ్. కొండా విశ్వేశ్వర్ రెడ్డి కి తెలియజేశారు. చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని తాండూరు.

వికారాబాద్, పరిగి, చేవెళ్ల శేరిలింగంపల్లి రాజేంద్రనగర్. మహేశ్వరం నియోజకవర్గంలో కూడ ప్రజలు కమలం పువ్వుకు ఓట్లు వేశారని తెలిపారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డి రెండు లక్షల ఓట్ల మెజార్టీతో గెలవడం ఖాయం అని పరమేష్ గౌడ్ వివరించారు.

## ఈదురుగాలులకు, వర్షానికి నష్టపోయిన బాధితులను పరామర్శించిన జెడ్పీ చైర్ పర్సన్

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 22(నమస్తే ఉదయం):**
మంగళవారం గద్వాల నియోజకవర్గంలో పలు గ్రామాలలో ఈదురుగాలుల బీభత్సానికి



బాధితులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ సరిత

ఆస్థినష్టంతో పాటు చెట్లు, విద్యుత్ స్థంబాలు విరిగి గుడిసెలు కూలిపోయాయి. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత బుధవారం గద్వాల మండలం లత్తిపురం గ్రామంలో సందర్శించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈదురు గాలులకు ముష్టి దుబ్బ రంగన్న మరియు వడ్డే తిమ్మన్న ల గుడిసెలు కూలీపోయాయి. బాధిత కుటుంబాలకు జెడ్పి చైర్ పర్సన్ సరిత ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పేద ప్రజలకు ఇండ్ల నిర్మాణం చెప్పటకపోవడం ద్వారా ప్రజలకు ఈ దుస్థితి నెలకొందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో పేద ప్రజలకు ఇచ్చిన హామీ లలో డబుల్ బెడ్ రూంలు ఇచ్చి ఉంటే ఇంత నష్టం వాటిల్లే పరిస్థితి ఉండేది కాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల పక్షాన నిలుస్తోందన్నారు. ఈదురుగాలులకు నష్టపోయిన వారికి,ఇండ్లు లేని ప్రతి ఒకరికి లబ్ధిదారులను గుర్తించి పక్క ఇందిరమ్మ ఇండ్లు అదేవిధంగా కృషి చేస్తానని ఆమె బాధితులకు హామీ ఇచ్చారు.

ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు లత్తిపురం వెంకట్రామిరెడ్డి, గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, మధుసూదన్ బాబు, పూడూర్ ఈశ్వర్, జయన్న,లక్ష్మణ,జమ్మిచేడు ఆనంద్,కొండపల్లి రాఘవేంద్ర రెడ్డి,కుర్మన్న, రాజశేఖర్ యాదవ్, సంజన్న,సమీ,రాజు తదితరులు ఉన్నారు.

## టీ హబ్, టీ వర్క్సలకు కొత్త సీఈఓలు

**హైదరాబాద్,మే22(నమస్తే ఉదయం):**
టీ హబ్, టీ వర్క్సలకు తెలంగాణ ప్రభుత్వం కొత్త సీఈఓల నియమించింది. టీ -వర్క్స సీఈవోగా జోగిందర్ తనికెళ్ల, టీ హబ్ సీఈవోగా సీతా పల్లచోళ్లను నియమిస్తూ ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు ఈ పదవుల్లో మూడేళ్ల పాటు కొనసాగుతారని జయేష్ రంజన్ తెలిపారు.

# నేడు విద్యుత్ లేని ప్రాంతాలు

## విద్యుత్ అంతరాయానికి సహకరించాలని అధికారుల విజ్ఞప్తి

**రాజేంద్రనగర్, మే 22(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యుత్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 11 గంటల నుండి 12.30 వరకు బుద్వేల్ గ్రామం, గ్రీన్ సిటీ, శివ సాయి కాలనీ, గ్రీన్ మెడోస్, శాంతి గృహాలు , పరిసర ప్రాంతాలు, సహారా హెూమ్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలో (ఉప్పర్పల్లి సబ్ స్టేషన్) మధ్యాహ్నం 1నుండి 2.30 వరకు జలాల్బాబా నగర్, ఖయామ్ నగర్, మహమూదాబాద్, రాజేంద్రనగర్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో గల ఉప్పర్పల్లి ఫీడర్ మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 4.30 వరకు సత్నాంగ్ విహార్, హ్యాపీ హెూమ్స్, జనచైతన్య, గదా బేగ్, ఫేజ్ III టవర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హాథిరాం తెలిపారు.

ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### కాటేదాన్, రాఘవేంద్ర కాలనీలో...

రాఘవేంద్ర కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగల కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి గురువారం ఉదయం 11 గంటల నుండి 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కాటేదాన్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. ఈ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలైన రాఘవేంద్ర కాలనీ అలీ బై మజీద్ ఏరియా , శాస్త్రి పురం జూన్ కిరాణా కీర్తి వాటర్ ఎమ్మెస్ స్కూల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

### బాబుల్ రెడ్డి నగర్లో...

నేషనల్ పోలీస్ అకాడమీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒకటిన్నర నుండి మూడు గంటల వరకు, మూడు గంటల నుండి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు వివిధ మరమ్మత్తుల నిమిత్తం సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హరినాథ చారి తెలిపారు.

### హిమాయత్ సాగర్ ...

హైదర్ షా కోట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు వివిధ మరమ్మత్తుల నిమిత్తం వెంకటేశ్వర కాలనీ డైమండ్ వ్యాలీ ప్రశాంత్ నగర్ బృందావన్ కాలనీ తిరుమల గార్డెన్ పద్మశ్రీ హిల్స్ పావని హార్మోని విల్లాస్, బండ్లగూడ జాగీర్, కాళీ మందిర్ విద్యుత్తు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుండి రెండున్నర గంటల వరకు విద్యానగర్ వీకర్ సెక్షన్ కాలనీ



సుబ్రమణ్య కాలనీ శివ పూరి శివ సాయి నగర్ బైరాగి గూడా సంజయ్ గాంధీ నగర్ ఇండస్ వ్యాలి, లిబ్ డం విల్లాస్ ,సంఘం సిటీ, భాగ్యనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం మూడున్నర నుండి సాయంత్రం 5 గంటల వరకు పవన్ పటేల్స్ కేకే కన్వెన్షన్ రాధానగర్ రాధా నగర్ ఫేస్ టు రఘురాం నగర్ ప్రాంతాలలోసరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలైన పవన్ పటేల్ కేకే కన్వెన్షన్ రాధానగర్ రాజనగర్ ఫేస్ టు, గంధం గూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించడానికి విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏ ఈ తెలిపారు.

### కిస్మత్పూర్లో విద్యుత్ సరఫరా నిరుపేత ...

కిస్మత్పూర్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని రాక్ చర్చ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఓమ్నగర్, రాఘవేంద్ర కాలనీ, యాదాద్రి కాలనీ, ఎన్ఆర్ఐ టౌన్షిప్, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎస్ఎం కన్స్ట్రక్షన్స్, రాధా రియాలిటీ, గిరిధారి, గిరిధారి కళాఖండాల్లో సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారు. ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు

### కోత్వాల్ గూడలో విద్యుత్ సరఫరా నిలిపివేత...

శంషాబాద్ పరిధిలోని వివిధ గ్రామాలలో పలు వార్డులలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు శంషాబాద్ ఏఈ అప్సర్ షేక్ బాషా ఓ ప్రకటనలో తెలిపారు. శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని కోత్వాల్ గూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఎం.ఆర్.ఓ కార్యాలయం వద్ద గల విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు వివిధ మరమ్మత్తుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ అప్సర్ షేక్ భాషా తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన కొత్వాల్ గూడ ఆర్కే గార్డెన్ ఎమ్మార్వో కార్యాలయం ప్రాంతం మహావీర్ బిల్డర్స్ ప్రాంతం శంషాబాద్ మార్కెట్ ఇంచ్ బై ఇంచ్ ప్రాంతం కాశిష్ ఫంక్షనల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు వినియోగదారులు ఈ విద్యుత్ అంతరాయా నికి సహకరించగలరని ఆయన కోరారు.

### నేడు శంకరాపురం విద్యుత్తు ఫీడర్ పరిధిలో సరఫరా నిలిపివేత

శంకరాపురం విద్యుత్ ఫీడర్ పరిధిలో వివిధ మరమ్మతుల నిమిత్తం గురువారం సరఫరా నిలిపివేస్తున్నట్లు షాపూర్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు. ఈ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 23.05.2024 ఉదయం 9.00 గంటల నుండి 12.00 గంటల వరకు, రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తొండుపల్లి పకృతి ఫామ్స్, సుభాసన గ్రీన్స్, ముఖారి ఎస్టేట్స్, పెద్ద తూప్రా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు ఈ అంతరాయా నికి సహకరించాలని ఆయన కోరారు.





స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ , స్వామివారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్ దంపతులు కొలను సుష్మా మహేందర్ రెడ్డి దంపతులు, గణేష్ గుప్త దంపతులు

## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం..

### కల్యాణం.. కమనీయం

**రాజేంద్రనగర్,మే22(నమస్తే ఉదయం):**
శంషాబాద్ మున్సిపల్ పరిధి నర్సింగ్ మందిర్ ప్రసిద్ధిగాంచిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణం మహెూత్సవం బుధవారం ఆలయ అర్చకులు వేదమంత్రోచరణల మధ్యన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని కన్నుల విందువుగా నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంక రించిన తీరు అందర్నీ ఆకట్టుకుంది.ముత్యాల తలంబ్రాలతో స్వామివారి పెళ్లి వేడుక రంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్య ధారణ చేయించారు.

కల్యాణ మహెూత్సవానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ హాజరై ఆలయంలో స్వామి వారికి ప్రతేక్య పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేటి.ప్రకాష్ గౌడ్ తోపాటు మున్సిపల్ చైర్ పర్సన్ కోలన్ సుష్మామహేందర్ రెడ్డి,కౌన్సిలర్లు ఆయిల్ కుమార్,రేఖ గణేష్ గుప్తా,పట్టణ అధ్యక్షుడు దూడల వెంకటేష్ గౌడ్,సీనియర్ నాయకులు గణేష్ గుప్తా, మహేందర్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు కొనమోళ్ళ శ్రీను నలుమూలల భక్తులు హాజరయ్యారు. అనంతరం కల్యాణ మహెూత్సవం తిల కించారు. మొక్కులు చెల్లించుకొని స్వామి తీర్థ ప్రసాదం తీసు కున్నారు. ఈ కల్యాణ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు.





మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ సరిత, సమావేశంలో సభ్యులు

### అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

## అందేలా అధికారులు పనిచేయాలి : చైర్మన్ సరిత

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 22 (నమస్తే ఉదయం):**
ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందించ డంతో పాటు చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్త య్యేలా చొరవ తీసుకోవాలని జడ్పీ చైర్ పర్సన్ సరిత అధికారు లను ఆదేశించారు. బుధవారం గద్వాలలోని పాత ఎంపీడీవో కార్యాలయ సమావేశపు మందిరంలో జడ్పీ చైర్ పర్సన్ అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిం చడం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు ఎజెండాలో చేర్చిన అంశాలపై చర్చించారు. శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులు, ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు గురించి మాట్లాడారు. పలువురు జడ్పీటీసీలు తమ మండలాల్లో నెలకొన్న వివిధ సమస్యలపై ప్రశ్నించగా, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి అధికారులు వివరించారు. ఇందులోని ప్రధాన అంశాలపై జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సరిత మాట్లాడుతూ, సదరమ్ ధ్రువపత్రాలు పొందేందుకు స్లాట్ బుకింగ్ సమయాన్ని పెంచేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

వర్షాకాలం ప్రారంభం కాగానే హరితహారంలో భాగంగా లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారు లను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా టిఆర్టి ద్వారా కొత్త టీచర్ల నియామకం చేపట్టే వరకు వాలంటీర్ల నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపా లన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులు సమయానికి విధులకు రావాలని, వివిధ టెస్టులు బయటకు రాయకుండా అందుబాటులో ఉన్న ల్యాబ్ లోనే చేయాలన్నారు. అక్కడ ఏమైనా సమస్యలుంటే పరిష్కరించుకొని ముందుకెళ్లాలన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారుల పాలన ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో పారిశుధ్య పనులను చేపట్టి రోగాలు వ్యాపించకుండా అవసరమైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ఐజ నుంచి మేడికొండ వరకు ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న రహదారి నిర్మాణం పూర్తి చేయాలని, ఐజ పట్టణంలోని వంతెన పనులు కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్లాస్టిక్ వాడకం పెరుగుతోందని దాంతో క్యాన్సర్ వ్యాధితో మరణించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో జడ్పీ వైస్ చైర్పర్సన్ సరోజమ్మ, జిల్లా పరిషత్ సీఈవో కాంతమ్మ, పలువురు జడ్పిటిసిలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తో పోలిస్తే కాంగ్రెస్ వెయ్యి రెట్లు బెటర్

- వ్యవసాయం, ధాన్యం సేకరణలో ముందున్నాం
- ఇది తెలంగాణ రైతుల అభిప్రాయం
- భవిష్యత్‌లో దొడ్డు వడ్లకు బోనస్ ఇస్తాం
- పేదోళ్లు కూడా సన్నబియ్యం తినాలన్నదే తమ ఉద్దేశం
- ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం
- వచ్చే ఎన్నికల నాటికి హామీలన్నీ పూర్తిచేస్తాం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, (నమస్తే ఉదయం):**

బీఆర్ఎస్‌తో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, ధాన్యం సేకరణలో వెయ్యి రెట్లు మేలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గతంతో పోలిస్తే ముందస్తుగానే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేశాం. ఐకేపీ సెంటర్ల పెంపు గత ఏడాదితో పోలిస్తే నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేశాం. ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు జిల్లాకొక ఐఏఎస్‌ను నియమించి ఎప్పటికప్పుడు సమీక్ష చేయిస్తున్నాం. తరుగు, తాలు పేరుతో కోతలు లేవు. గతంలో ప్రతి క్వింటాకు 7 నుంచి 10 కిలోల వరకు తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ సాగింది. ఈ దఫా ఉక్కుపాదం మోపడంతో కోతలకు చెక్ పడిరది. దీంతో ప్రతి కింటాపై రైతుకు 150 నుంచి 200 రూపాయల వరకు అదనపు లబ్ధి చేకూర్చాం. రైతులు పంట అమ్ముకున్న ఐదు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు వేస్తున్నాం. గతంలో 45 రోజులు పట్టేది. రైతు ఎంతో వడ్డీ నష్ట పోయేవాడు. ఇప్పుడు వడ్డీ వ్యాపారుల వేధింపులు లేవు.

### రైతులకు పంట నష్ట పరిహారం

కేసీఆర్ ప్రభుత్వంలో ఫసల్ బీమా యోజన లేదు. ఉంటే కనీసం పంట నష్టపరిహారం వచ్చేది. అయినప్పటికీ కాంగ్రెస్ రైతు ప్రభుత్వం కాబట్టి పంట నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం అందిస్తోంది. ఇక ముందు ఏ ఒక్క రైతు కూడా ఇలా నష్టపోకుండా ప్రభుత్వమే రైతుల ప్రీమియం చెల్లించి పంట బీమా పథకాన్ని రూ.3,000 కోట్లు వెచ్చించి వానాకాలం నుంచి అమలు చేస్తున్నాం. తడిచిన ధాన్యాన్ని సైతం ఈ ప్రభుత్వం సేకరిస్తుంది. గతంలో కల్లాల్లో వరి కుప్పల మీద రైతులు గుండె పగిలి చనిపోయారు. కానీ మాది రైతు ప్రభుత్వం అని తెలిసి రైతులు గుండె ధైర్యంతో బతుకుతున్నారు.

### భవిష్యత్‌లో దొడ్డు వడ్లకు బోనస్

తెలంగాణలో దొడ్డు వడ్లు తినడం చాలా తగ్గిపోయింది. గత ప్రభుత్వంలో సన్న బియ్యం పేరుతోటి దొడ్డు వడ్లనే పాలిష్ చేసి అంగన్వాడీలకు, మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించే వారు. అలా కాకుండా పేదలు కూడా పెద్దోళ్లు తినే సన్న బియ్యం తినాలనే సంకల్పంతో రేషన్ దుకాణాల్లో కూడా సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని పెట్టుకుంది. కానీ ఇతర రాష్ట్రాల నుంచి సన్నబియ్యాన్ని దిగుమతి చేసుకోవా ల్సిన పరిస్థితి ఉంది. అందుకే సన్న వడ్లను ఉత్పత్తి చేసుకునేందుకు ఈ బోనస్ పథకాన్ని ప్రవేశపెట్టాం. భవిష్యత్‌లో దొడ్డు వడ్లకు దీనిని అమలుచేస్తాం.

### ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం

రైతులను కాల్చుకు తిన్న బీఆర్ఎస్ అగ్ర నాయకులు ఇప్పుడు రైతుల పేర నాటకాలు ఆడుతున్నారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని 2020లో కేసీఆర్ ప్రకటించారు. ఆ తర్వాత మూడేళ్లు అధికారంలో ఉన్నా నయా పైసా బోనస్ ఇవ్వలేదు. అందుకే ఓడగొట్టి రైతులు ఇంట్లో కూర్చోబెట్టారు. ప్రజా ప్రభుత్వం ఎక్కడా దుబారా చేయకుండా కేసీఆర్ అస్తవ్యస్థం చేసిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. త్వరలో అన్ని హామీలను నిలబెట్టుకుంటాం. వందరోజు ల్లోనే హామీల అమలు ప్రక్రియను ప్రారంభించాం. వచ్చే ఎన్నికల నాటికి అన్ని హామీలను పూర్తి చేసి తీరుతాం. లేకుంటే ఓట్లే అడగం. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు తమ తప్పుడు ప్రకటనలు ఆపాలని హితవు పలికారు.

# కార్మిక యోధుడు పర్స సత్యనారాయణకు ఘనంగా నివాళులు

**రాజేంద్రనగర్, మే 22(నమస్తే ఉదయం):**

కార్మిక యోధుడు పర్స సత్యనారాయణ కు ఘనంగా నివాళులు అర్పించారు. బుధవారం కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో స్థానిక సిఐటియు కార్యాలయంలో కార్మిక నాయకుడు ఆదర్శమూర్తి పర్సా సత్యనారాయణ



వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి సిఐటియు నాయకులు నివాళులర్పించారు. అనంతరం జరిగిన వర్ధంతి సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ భూపాల్ హాజరై మాట్లాడుతూ... పర్స సత్యనారాయణ 19 ఏళ్ల వయసులోనే ఎర్రజెండా చేతబట్టి పేదల పక్షాన పోరాటం చేసి గొప్ప కమ్యూనిస్టు నాయకుడుగా పేరు తెచ్చుకున్నాడని అన్నారు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పర్స సత్యనారాయణ కీలక పాత్ర వహించి భూమి కోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం అనేక పోరాటం నిర్వహించిన నాయకుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యేగా పనిచేసి సొంత ఇల్లు కూడా సంపాదించుకోకుండా ప్రజల కోసం పనిచేసిన వ్యక్తి సిఐటి యు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు .అలాగే 1970లో సిఐటియు ఆవిర్భావం సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పర్స సత్యనారాయణ , నండూరి ప్రసాద్ రావు వ్యవస్థాపక సభ్యులలో ముఖ్యులు అని అన్నారు తెలుగు రాష్ట్రాలలో కార్మికులకు ఈఎస్ఐ,పిఎఫ్ 12 గంటల గురించి అనేక పోరాటం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చంద్రమోహన్, కోశాధికారి కవిత, ఉపాధ్యక్షులు రుద్ర కుమార్, సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, జిల్లా కమిటీ సభ్యులు శేఖర్ బుగ్గ రాములు, ఎల్లయ్య, వీరయ్య, ప్రవీణ్, పెంటయ్య , రాములు, కాటేదాన్ పారిశ్రామిక ప్రాంత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యము పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి శృతి ఓజ, జిల్లా కలెక్టర్ బిఎస్ సంతోష్


# ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

- జిల్లా ప్రత్యేక అధికారిని శృతి ఓజా

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 22(నమస్తే ఉదయం):**

కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా ప్రత్యేక అధికారిని, ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ శృతి ఓజా అధికారులకు సూచించారు. బుధవారం గద్వాల మండలం బీరెల్లి, లత్తిపురం గ్రామాలలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఐకెపి ద్వారా నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించాలని, సేకరించిన ధాన్యాన్ని వెనువెంటనే లారీలలో లోడ్ చేయించి రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. డాటా ఎంట్రీ పనులను ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ, రైతులకు వెంటనే డబ్బులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తరలింపులో జాప్యానికి తావులేకుండా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని ఆమె తెలిపారు. వర్షాల వల్ల ధాన్యం తడిచిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత సీజన్ లో 70 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగినది, ప్రస్తుతం 10 కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం సేకరణ జరుపుతున్నామని, ఎక్కడ కూడా తరుగు వంటివి లేకుండా గట్టి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. కేంద్రాలలో రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలూ అందుబాటులో ఉంచామని తెలిపారు.

ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకుని అధికారుల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ విమల, అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




# 3 కరెన్సీ నోట్ల నంబర్లే 'టోకెన్'గా హవాలా?

- లిక్కర్ కేసు అనుబంధ చార్జిషీట్‌లో ఈడీ
- మరో నలుగురి ప్రమేయంపై వాదనలు

**న్యూఢిల్లీ, (నమస్తే ఉదయం):**

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు మరో నలుగురి ప్రమేయంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకోవాలా? లేదా? అనే అంశంపై తీర్పును ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఈ నెల 29కి రిజర్వ్ చేసింది.

కవితతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున గోవాలో ప్రచారం నిర్వహించిన ముగ్గురు ఉద్యోగులు (చారియట్ ప్రొడక్షన్స్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్) దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, చరణ్‌ప్రీత్ సింగ్, ఇండియా ఎహెడ్ న్యూస్ ఛానల్ మాజీ ఉద్యోగి అరవింద్ సింగ్‌పై అభియోగాలు మోపుతూ ఈడీ ఈ నెల 10న సుమారు 200 పేజీలతో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసింది. దానిని పరిగణనలోకి తీసుకునే అంశంపై మంగళవారం విచారణ జరిగింది. కవితతో పాటు మిగిలిన నలుగురి ప్రమేయంపై ఈడీ బలమైన వాదనలు వినిపించింది.

కాల్ డేటాతో పాటు కాల్ రికార్డులను కూడా సకరించామని పేర్కొంది. హవాలా రూపంలో డబ్బులు మళ్లించేందుకు కరెన్సీ నోట్ల సీరియల్ నంబర్లను టోకెన్‌గా వాడారని ఈడీ ఆరోపించింది. ప్రిన్స్ కుమార్ చారియట్ మీడియా సంస్థలో ఉద్యోగిగా పనిచేశారు. రూ.100 కోట్ల అక్రమ మళ్లింపులో ఆయన పాత్ర స్పష్టంగా ఉంది. హవాలా ఆపరేటర్ కాంతికుమార్ ద్వారా మూడు దశల్లో రూ.16 లక్షలు ప్రిన్స్ కుమార్‌కు అందాయి.

అందులో మూడు కరెన్సీ నోట్ల సీరియల్ నంబర్లను టోకెన్ నంబర్‌గా ఉపయోగించి హవాలా మార్గంలో డబ్బులు తీసుకున్నారు. మరో నిందితుడు అరవింద్ సింగ్ గోవాకు డబ్బులు మళ్లించడంలో కీలకంగా వ్యవహరించాడు. ఇలా అందరి పాత్రపై బలమైన సాక్ష్యాలు సకరించామ'ంటూ ఈడీ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్‌కే మట్టా, న్యాయవాది జోహెబ్ హుస్సేన్ కోర్టు ముందు వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి కావేరి బవేజా తీర్పును వాయిదా వేశారు.

# భూతగాదాలు, కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి తల్లీకూతురు ఆత్మహత్య...

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 22(నమస్తే ఉదయం):**

భూతగాదాలు, కుటుంబ కలహాలు ఓ కుటుంబంలో విషాదాన్ని నింపాయి. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లా మనవపాడు మండల పరిధిలోని ఏ-బుడిదపాడు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏ-బుడిదపాడు గ్రామానికి చెందిన మాల నరసింహులు తన భార్య వరలక్ష్మి (39), కూతురు అనురాధ (18) భూతగాదాలు, కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఇంట్లో పురుగుల మందు తాగారు. ఈ ఘటనలో వరలక్ష్మి, అనురాధ పరిస్థితి విషమించడంతో హుటాహుటిన కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్కడ చికిత్స అందేలోపే ఇద్దరు మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.మాల నరసింహులు మాత్రం ఆత్మహత్య చేసుకోవాలని భావించినా.. పురుగుల మందు తాగడానికి భయపడ్డాడు. అయితే తన కళ్ళ ముందే భార్య, కూతురు చనిపోవడంతో కుప్ప కూలిపోయాడు. గత కొన్ని రోజులుగా అన్నదమ్ములకు మధ్య భూ తగాదాలు ఉన్నాయి. ఎన్నోసార్లు ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకోవడం గొడవలు చేసుకున్నట్లు తెలిసింది. అయితే కూతురు, కొడుకు చదువు కోసం పెళ్లి కోసం చాలా ఇబ్బందులు గురవుతున్నామని, తమకు వారసత్వం కింద ఇచ్చిన భూములు సీలింగ్ ఉండడంతో ఎవరు కొనడం లేదని భావించి ఎన్నోసార్లు



అన్నదమ్ములతో మాల నరసింహులు ప్రాధేయపడ్డాడు. తన కుటుంబానికి ఎవరూ సహకరించడం లేదని భావించి మంగళవారం కుటుంబ సభ్యులు చనిపోవాలని పురుగుల మందు సేవించినట్లు స్థానికులు తెలిపారు.

ఘటనలో తల్లి కూతురు మృతి చెందారు. కొడుకు హైదరాబాద్‌లో చదువుకుంటున్నట్లు తెలిసింది. ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కేరళ పద్మనాభ స్వామి ఆలయానికి విముక్తి

**తిరువనంతపురం, మే 22(నమస్తే ఉదయం):**

కేరళ కమ్యూనిస్ట్ ప్రభుత్వ బారి నుండి పద్మనాభ స్వామి ఆలయం విముక్తి పొందింది... రాజ్యాంగం ప్రకారం ఆలయాల మీద ప్రభుత్వాలకు ఏ హక్కు లేదు... రెండు లక్షల కోట్ల ఆస్తులు, గొప్ప వారసత్వం కలిగిన పద్మనాభస్వామి ఆలయం ఇకపై ప్రభుత్వానికి చెందినది కాదు, ఇప్పుడు దీనిని ట్రావెన్కోర్ రాయల్ ఫ్యామిలీ చూసుకుంటుంది... సుబ్రమణియన్ స్వామి ఈ కేసుతో పోరాడి ఆలయాన్ని పొందారు. ఆలయ నిర్వహణ సభ్యులందరూ ఇప్పుడు హిందువులే అవుతారు. ఈ సమాచారం ట్రావెన్కోర్ కిరీట యువరాజు ఆదిత్య వర్మ తన తల్లి గౌరీ లక్ష్మికి వివరించినప్పుడు, ఇద్దరూ ఆనందంతో కేకలు వేశారు. ఇది ఆరంభం దేవాలయాల ప్రభుత్వ యాజమాన్యాన్ని వదిలించుకోవడానికి పోరాటం ఇంకా చాలా కాలం. హిందువులు ఐక్యత గురించి ఆలోచిస్తే, ఇదే పరిస్థితి, మీరు ఐక్యమయ్యే రోజు, భూమిని తిప్పగల సామర్థ్యం మీకు ఉంది, మీరు దేశంలోని అన్ని దేవాలయాలను విడిపించాలి.



# ఘనంగా పారుచర్ల సవరమ్మ దేవర ఉత్సవాలు

**ధరూర్,మే22(నమస్తే ఉదయం):**

ధరూర్ మండలంలోని పారుచ్చర్ల, మన్నాపురం,అల్వాల్ పాడు గ్రామాల్లో పారుచ్చర్ల సవారమ్మ దేవర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

బుధవారం గ్రామ దేవతకు గ్రామస్తులు కుంభాలతో వెళ్లిపూజలు నిర్వహించారు. గ్రామాల్లో తమ అభిమాన పార్టీ నాయకుల ఫ్లెక్సీలు వేసి అభిమానాన్ని చాటు కున్నారు.



దేవాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి, గ్రామాల్లో మిఠాయి, గాజుల అంగళ్లు, వివిధ వ్యాపార సము దాయాలతో కళకళలాడాయి. గ్రామ దేవతను దర్శించుకున్న నాయకులు



దేవర ఉత్సవాల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బంధు మిత్రులతో కలిసి విందు భోజనం చేశారు. ఊర్ల దేవర సందర్భంగా గ్రామాలలో బంధుమిత్రులతో సందడిగా మారింది.

**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.